ప్రభుత్వ దవాఖానలో తగ్గిన ప్రసవాలు

మెట్పల్లి సామాజిక దవాఖాన

- న్యూట్రీషన్, కేసీఆర్ కిట్లు నిలిపివేత
- ఆడశిశువుకు రూ.13 వేలు, మగశిశువుకు రూ.12 వేల ప్రోత్సాహకం బంద్
- పట్టించుకోని రాష్ట్ర సర్కార్, అధికార యంత్రాంగం

మెట్పల్లి, మార్చి 9: మెట్పల్లి ప్రభుత్వ దవాఖాన (సీహెచ్‌సీ) బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రసవం కోసం వచ్చే గర్భిణులతో కిటకిటలాడేది. కానీ ప్రస్తుతం అందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తున్నది. ప్రభుత్వ దవాఖానలో ప్రసవం చేసుకునేందుకు గర్భిణులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. బీఆర్ఎస్ పాలనలో ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ దవాఖానాలను తీర్చిదిద్దేందుకు అధిక ప్రాధాన్యమిచ్చింది. ప్రధానంగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన గర్భిణులు ప్రభుత్వ దవాఖానలో ప్రసవం చేసుకునేలా అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసింది. ప్రసవం కోసం ప్రభుత్వ దవాఖానకు వచ్చేలా సంబంధిత వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారి నుంచి కింది స్థాయి సిబ్బందితో క్షేత్ర స్థాయిలో గర్భిణులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో 30 పడకల సామర్థ్యం గల మెట్పల్లి ప్రభుత్వ దవాఖాన ప్రసవాల సంఖ్యలో అనేక సార్లు రాష్ట్ర స్థాయిలో రికార్డును నమోదు చేసుకుంది. కాలక్రమేనా ఆ రికార్డు నిలిచిపోయింది. ఏడాది కాలంగా ప్రసవాల సంఖ్య పెంపు కోసం క్షేత్ర స్థాయిలో గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడంపై సంబంధిత అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలుస్తున్నది. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు 1316 ప్రసవాలు నమోదు కాగా, 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 ఫిబ్రవరి 28 వరకు కేవలం 910 ప్రసవాలు జరిగాయి. గతేడాది నమోదైన ప్రసవాల సంఖ్య ఈనెల 31 వరకు కూడా చేరుకునే అవకాశం కనిపించడం లేదు.

న్యూట్రీషన్, కేసీఆర్ కిట్లు లేవు

గత బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ దవాఖానలకు కొత్త వైభవం తెచ్చింది. దవాఖానలో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు వైద్యుల నియామకం చేపట్టింది. పైగా ప్రైవేట్ దవాఖానల్లో గర్భిణులు ప్రసవాలు చేసుకోవడం వల్ల వేలాది రూపాయల ఆర్థిక భారంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బంది పడాల్సి వస్తుందనే ఆలోచనతో ప్రభుత్వ దవాఖానాల్లో ప్రసవాలను ప్రోత్సహించింది. అందుకు అనుగుణంగా వసతులను కల్పించింది. గర్భిణులకు పురిటి నొప్పులు వచ్చినప్పుడు ఇంటి నుంచి దవాఖానకు అంబులెన్స్‌లో తీసుకొని రావడం, ప్రసవం తర్వాత తల్లి, శిశువును సురక్షితంగా ఇంటికి చేర్చడానికి ప్రత్యేకంగా అమ్మఒడి వాహనం ద్వారా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. అదే విధంగా ప్రసవం అయిన తర్వాత తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉండేలా న్యూట్రీషన్ కిట్టు, వివిధ రకాల వస్తువులతో కూడిన కేసీఆర్ కిట్టు అందించేవారు. దీనికి తోడు మగశిశువు జన్మిస్తే రూ. 12 వేలు, ఆడ శిశువు జన్మిస్తే రూ.13 వేలు ఆర్థిక ప్రోత్సాహకం అందించేది. కానీ ఏడాది కాలంగా కేసీఆర్ కిట్లు, న్యూట్రీషన్ కిట్లు, ఆర్థిక ప్రోత్సాహకం ఇవ్వడం లేదు. 2024 ఏప్రిల్ 9 నుంచి ఆ కిట్ల పంపిణీ పూర్తిగా నిలిచిపోయింది. అవేమి రాకపోవడంతో చాలా మంది గర్భిణులు ప్రసవం కోసం ప్రభుత్వ దవాఖానకు వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదని గత కొన్ని నెలలుగా ప్రభుత్వ దవాఖానలో నమోదైన ప్రసవాల సంఖ్యనే స్పష్టం చేస్తున్నది.

మెట్పల్లి దవాఖానలో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 ఫిబ్రవరి 28 వరకు సాధారణ, శస్త్రచికిత్స ద్వారా జరిగిన ప్రసవాల వివరాలు

నెల	సాధారణ	శస్త్రచికిత్స	మొత్తం
ఏప్రిల్-2024	32	80	112
మే	26	65	91
జూన్	24	63	87
జూలై	18	62	80
ఆగస్టు	27	65	92
సెప్టెంబర్	21	59	80
అక్టోబర్	17	67	84
నవంబర్	22	60	82
డిసెంబర్	26	55	81
జనవరి-2025	18	58	76
ఫిబ్రవరి	15	30	45

ఎస్సారెస్పీ కాలువ ఇలా.. సాగునీరు పారేదెలా?


డీ-73 కాలువలో పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలు, చెట్లు

పెగడపల్లి మండలం దోమలకుంట సమీపంలోని ఎస్సారెస్పీ డీ–73 కాలువలో పిచ్చిమొక్కలు, చెట్లు పెరిగి చివరి ఆయకట్టుకు సాగు నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ కాలువ ద్వారా దోమలకుంట, ఆరవల్లి, సుద్దపల్లి, బతికపల్లి గ్రామాల్లోని వందలాది ఎకరాలకు సాగు నీరు అందుతుండగా, కాలువలో పెరిగిన చెట్లు, పిచ్చి మొక్కలతో నీళ్లు పూర్తి స్థాయిలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలకు మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఎస్సారెస్పీ ఉన్నతాధికారులు స్పందించి కాలువలోని చెట్లు, పిచ్చి మొక్కలు తొలగించి, సాగు నీరు సక్రమంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. **-పెగడపల్లి, మార్చి 9**

కోరుట్లలో ఏర్పాటు చేసిన బయో మైనింగ్ చెత్త శుద్ధీకరణ యంత్రం

బయో మైనింగ్ మిషన్ ద్వారా తయారు చేసిన ఎరువు

బయో మైనింగ్ ద్వారా చెత్త శుద్ధికి శ్రీకారం

- కోరుట్లలో రూ. 2.37 కోట్లతో చెత్త శుద్ధీకరణ యంత్రం ఏర్పాటు

కోరుట్ల, మార్చి 9: కోరుట్లలో చెత్త నుంచి సేంద్రియ ఎరువుల తయారీకి అడుగులు పడ్డాయి. చెత్తను బయో మైనింగ్ యంత్రం సాయంతో శుద్ధి చేసే ప్రక్రియను ఇటీవల అధికారులు ప్రారంభించారు. బయో మైనింగ్ యంత్రంతో వ్యర్థాలు వివిధ దశల్లో శుద్ధి చేసిన తర్వాత వచ్చే బయో ఎర్త్‌ను జీవ ఎరువుగా వినియోగించేందుకు బల్దియా అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

చెత్త శుద్ధీకరణ యంత్రం ఏర్పాటు

కోరుట్ల పట్టణంలోని కల్లూరు రోడ్డులో 5.50 ఎకరాల విస్తీర్ణంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ. 2.37 కోట్లతో బయో మైనింగ్ చెత్త శుద్ధీకరణ యంత్రాన్ని నెలకొల్పారు. కోరుట్లలో లక్షపై చిలుకు జనాభా ఉండగా, 22,115 వేల నివాస గృహాలు, 1038 వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. నిత్యం 34.25 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ జరుగుతున్నది. చెత్తను పట్టణ శివారులోని డంపింగ్ యార్డులో నిల్వ ఉంచడంతో పరిసరాలు కంపు కొడుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బయో మైనింగ్ ప్రక్రియ ద్వారా చెత్త శుద్ధీకరణకు ప్రణాళికలు తయారు చేశారు. ఎట్టకేలకు ఇటీవల బల్దియా అధికారులు బయో మైనింగ్ యంత్రం ఏర్పాటు చేయడంతో చెత్త సమస్యకు పరిష్కారం దొరికింది. బయో మైనింగ్ ద్వారా ఇప్పటికే చెత్త శుద్ధి ప్రక్రియ జరుగుతున్నది. ఈ చెత్త శుద్ధి ద్వారా వచ్చే జీవ ఎరువు బయో ఎర్త్ పంటలకు ఎరువుగా పనికి రావడంతో బల్దియా అధికారులు పరీక్షల కోసం ఎరువును ప్రయోగశాలకు పంపారు. ఫలితాల విశ్లేషణ అనంతరం బయో మైనింగ్ ద్వారా వెలువడే జీవ ఎరువును రైతులకు ఉచితంగా అందించనున్నారు.

వివిధ దశల్లో చెత్త శుద్ధీకరణ ప్రక్రియ

హైదరాబాద్‌కు చెందిన అన్నపూర్ణ కన్‌స్ట్రక్షన్ సంస్థ చెత్త శుద్ధీకరణ పనులు చేపడుతున్నది. బయో మైనింగ్ ప్రక్రియలో 100 ఎంఎం కన్నా తక్కువ పరిమాణం గల వ్యర్థాలు అంటే పెద్ద పెద్ద ప్లాస్టిక్ బాటిళ్లు, దుస్తులు లాంటివి మొదటి దశలో బయటకు వస్తాయి. రెండో దశలో చిన్న సైజు ఉండే వ్యర్థాలు వేరు చేస్తాయి. ఇలా వివిధ దశల్లో వచ్చే వ్యర్థాలను సిమెంట్ పరిశ్రమలకు సరఫరా చేస్తారు. 8 ఎంఎం కన్నా తక్కువ పరిమాణం గల వ్యర్థాలు చివరకు సేంద్రియ ఎరువుగా మారుతాయి. ఎరువు పొలాల్లో వినియోగించుకోవచ్చు.

ఎరువు పంట పొలాల్లో ఉపయోగించవచ్చు

చెత్తను నాలుగు దశలుగా విభజించి శుద్ధి చేయడం జరుగుతుంది. చివరి అవుట్ పుట్ 8ఎంఎం కన్నా తక్కువగా ఉంటుంది. దీన్నే బయో ఎర్త్ అంటారు. రైతులు పంట పొలాల్లో ఎరువుగా ఉపయోగించుకోవచ్చు. డంపింగ్ యార్డులో మొత్తం 65, 103 మెట్రిక్ టన్నుల చెత్త పోగై ఉంది. ఇప్పటి వరకు 27790 మెట్రిక్ టన్నుల చెత్తను బయో మైనింగ్ ప్రక్రియ ద్వారా వేరు చేయగా, 12,499 మెట్రిక్ టన్నుల బయో సాయిల్ (ఎరువు) తయారైంది. ప్లాస్టిక్ వ్యర్థాలు 5460.25 మెట్రిక్ టన్నులు, సీ అండ్ డీ 1713.48 మెట్రిక్ టన్నులు, ఇతర వ్యర్థాలు 714.925 టన్నులు వేరు చేశాం. **- బట్టు తిరుపతి, మున్సిపల్ కమిషనర్, కోరుట్ల**

అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

సారంగాపూర్, మార్చి 9: మండలంలోని నాగునూర్ గ్రామంలో గల అంబేద్కర్ విగ్రహానికి ఆదివారం ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పేట భాస్కర్ పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల జేఏసీ నాయకులు ఎవుసం గంగాధర్, బోనగిరి మల్లారెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎలిశెట్టి గంగారెడ్డి, అంబేద్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జెల రాజు, మండలాధ్యక్షుడు పూడూరి శోభన్, నాయకులు శనిగరపు రాజేశ్, గాజర్ల రాజయ్య, మచ్చ జగన్, రాహుల్, వంశీ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

జగిత్యాల టౌన్, మార్చి 9: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సమస్యలపై అర్జీలను సమర్పించాలని సూచించారు.

వీధి కుక్కల దాడి

మెట్పల్లి రూరల్, మార్చి 9: మండలంలోని కోనరావుపేట గ్రామంలో వారం రోజుల వ్యవధిలో పది మందిపై వీధి కుక్కలు దాడి చేశాయి. శనివారం సాయంత్రం ఐదుగురిపై దాడి చేయగా గాయాలయ్యాయి. బాధితులు కోరుట్ల ప్రభుత్వ దవాఖానకు వెళ్లి టీకాలు వేయించుకున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వీధి కుక్కల బారి నుంచి గ్రామస్తులకు రక్షణ కల్పించాలని మాజీ ఉపసర్పంచ్ మారు జనార్దన్‌రెడ్డి కోరారు.

అటవీ భూములను చదును చేసిన ట్రాక్టర్లు సీజ్

కథలాపూర్, మార్చి 9: కథలాపూర్ మండలం చింతకుంట గ్రామశివారులో అటవీశాఖకు చెందిన భూములను చదును చేస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు కథలాపూర్ సెక్షన్ అధికారి ఎండీ ముస్తాక్ అలీ ఆదివారం తెలిపారు. శనివారం రాత్రి అక్రమంగా మూడు ట్రాక్టర్లతో అటవీభూములను చదును చేయగా అటవీశాఖ సిబ్బందికి కనిపించిందన్నారు. మూడు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ తనిఖీల్లో బీట్ ఆఫీసర్లు సాయిరాం, శివరాజ్, శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

వెల్గటూర్ మార్చి 9: కిషన్‌రావుపేటలోని నాగపల్లి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆలయ కమిటీ చైర్మన్ నైనాల అజయ్ కోరారు.

స్నేక్ క్యాచర్ మృతి

రామగిరి, మార్చి 9: పెద్దపల్లి జిల్లా బేగంపేట గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ పోతరవేణి భాస్కర్ అలియాస్ పాముల భాస్కర్ (52) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భాస్కర్ 20ఏళ్లుగా రామగిరి మండలం, సింగరేణి, పరిశ్ర గ్రామాల్లో ఎక్కడైనా ఎవరి ఇంట్లోనైనా పాములు దూరి భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు సమాచారం అందిస్తే చాలు క్షణం లో అక్కడి చేరుకుంటాడు. ఎంతటి విష సర్పమైన పట్టుకొని సురక్షితంగా అటవీ ప్రాంతంలో వదిలి వేసేవాడు. పాములు పట్టడంలో యువకులకు కూడా తర్ఫీదు ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

సారంగాపూర్, మార్చి 9: కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఉమ్మడి మండల మాజీ ఎంపీపీ కొల్ముల శారద డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మహిళలకు నెలకు రూ. 2500 చొప్పున నగదు, 18 ఏళ్లు నిండిన మహిళలకు స్కూటీలు, కల్యాణలక్ష్మి పథకం కింద నగదుతో పాటు తులం బంగారం ఇస్తామని హామీలు ఇచ్చి, ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మహిళలకు ఎన్నో పథకాలను అమలు చేశారని, మహిళ సంక్షేమం కోసం తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తమవంతు కృషి చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో రైతులు కన్నీరు పెడుతున్నారని, ఈ ప్రభుత్వానికి రైతులు కష్టాలు పట్టడం లేదన్నారు. రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వనికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు ఒడ్నాల లావణ్య, బోడ స్వప్న, శీలం శిరోమణి, తాటి లక్ష్మి, బైరి మల్లేశ్ యాదవ్, బీఆర్ఎస్ సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల అధ్యక్షులు తేలు రాజు, నేరెళ్ల సుమన్ గౌడ్, మాజీ సింగిల్ విండో చైర్మన్లు సాగి సత్యం రావు, మెరుగు రాజేశం తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పని చేయాలి

అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, నాయకులు

జగిత్యాల రూరల్, మార్చి 9: అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని తహసీల్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాలు అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ నల్ల శ్యామ్, నాయకులు దుమాల రాజ్‌కుమార్, నకుమల్ల లక్ష్మీనారాయణ, మద్దెల నారాయణ, బోనగిరి నారాయణ, చిర్ర నరేశ్, దుమాల గంగాధర్, లింగయ్య, కాయితి శ్రీనివాస్, లక్ష్మణ్, శ్రీనివాస్ రావు, సంపత్ కుమార్, పవన్, శేఖర్, శ్రీనివాస్, వెంకటరమణ, రాజు, రవి, గంగారం, క్రాంతి, ముత్తు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

వేదికపై గురువులతో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

కథలాపూర్, మార్చి 9: కథలాపూర్ మండలం బొమ్మెన జడ్పీ హైస్కూల్ ఆవరణలో 2007–08 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి, శాలువాలతో సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ఆట, పాటలతో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. సామూహికంగా భోజనాలు చేశారు. ఒకరికొకరు ఆటోగ్రాఫ్ తీసుకొని మళ్లీ కలుద్దాం మిత్రమా అంటూ సమావేశాన్ని ముగించేశారు.

ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న నవీన్

ఆలయానికి విరాళం

మేడిపల్లి, మార్చి 9: భీమారం మండలం మన్నెగూడెం శివారులోని పల్లగుట్టపై నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయం ఎదుట ధ్వజస్తంభం ఏర్పాటుకు ఐయిలాపూర్ నిమిషకవి నవీన్ రూ. లక్షా 82 వేలు ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తేలు నరేశ్, ఆలయ కమిటీ సభ్యులు కట్కం రమేశ్, హనుమండ్ల సతీశ్, కొండ కిషన్‌గౌడ్, కోరుట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

రామగిరి, మార్చి 9 : నాలుగు రోజులుగా మంథని జేఎన్టీయూ కళాశాల ఆవరణలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య క్రీడామైదానంలో నిర్వహిస్తున్న బీ జోన్ స్థాయి క్రికెట్ లీగ్ కమ్ నాకౌట్ టోర్నమెంట్‌లో లీగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు కొండగట్టు జేఎన్టీయూ రెండు లీగ్ మ్యాచ్‌లు నెగ్గి సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. గోదావరిఖనికి చెందిన కంటి వైద్యులు దుర్గాప్రసాద్, పిడియాట్రిస్టు మోరే సత్యంబాబు విజేత లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీడీ పింగిళి కృష్ణారెడ్డి, ఎంపైర్లు నాగకృష్ణ, సూర్య, సత్య, తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం

వేదికపై ఉపాధ్యాయులు, విద్యార్థులు

కథలాపూర్, మార్చి 9: కథలాపూర్ మండలం బొమ్మెన జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం తొమ్మిదో తరగతి విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు సూచనలిచ్చారు. మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ఆట, పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు మధుకర్, అంబటి రవి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మెట్పల్లి రూరల్, మార్చి 9: మండలంలోని వెల్లుల్ల శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని ఎస్ఐ కిరణ్‌కుమార్ విజిలెన్స్ సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కొన్ని రోజులుగా ఓ వ్యక్తి మండలంలోని పలు గ్రామాల్లో ద్విచక్ర వాహనంపై తిరుగుతూ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తూ వెల్లుల్ల శివారులోని ఓ పాత ఇంట్లో నిల్వ చేస్తున్నాడన్న సమాచారం మేరకు ఆదివారం విజిలెన్స్ సిబ్బంది దాడి చేశారు. 17 బస్తాల్లో 8.85 క్వింటాళ్ల బియ్యం దొరికినట్లు తెలిపారు. పోలీసులు వస్తున్నారన్న సమాచారంతో సదరు వ్యక్తి పారిపోగా, అతని ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టుకున్న బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ అధికారులకు అప్పగించినట్లు చెప్పారు.

పసుపు బోర్డు ఏర్పాటుతో రైతులకు ప్రయోజనం లేదు

మల్లాపూర్, మార్చి 9: కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పసుపు బోర్డుతో రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని టీపీసీసీ నేత జువ్వాడి కృష్ణారావు అన్నారు. మండలంలోని పాతదాంరాజ్‌పల్లి గ్రామంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పసుపు పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు క్వింటాల్‌కు రూ. 15 వేలు కనీస మద్దతు ధర అందించాలని కోరారు. ఈ నెల 11న రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో మెట్పల్లిలో తలపెట్టిన పసుపు రైతుల మహాధర్నాకు పార్టీలకు అతీతంగా రైతులు హాజరై విజయంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎలాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, నాయకులు సిరిపురం రవీందర్, ఆనంద్‌గౌడ్, రాజారెడ్డి, భూమయ్య, సోమయ్య, రాజేందర్, ప్రతాప్, విలాస్, గంగారెడ్డి, సురేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేద యువతి వివాహానికి ఆర్థిక సాయం

అశ్వినికి నగదు, పట్టుచీర అందజేస్తున్న భక్త మార్కండేయ స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు

జగిత్యాల టౌన్, మార్చి 9: రాయికల్‌కు చెందిన పేద యువతి అశ్విని వివాహానికి జిల్లా కేంద్రానికి చెందిన శ్రీభక్త మార్కండేయ యువజన స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు ఆదివారం రూ. 10 వేల నగదు, పట్టు చీర అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు చిలుక మారి శ్రీనివాస్, సభ్యులు కొక్కుల సుదర్శన్, అనుమల్ల శ్రీనివాస్, ఆకుబత్తిని శ్రీనివాస్, మానపురి శ్రీనివాస్, కోమాకుల సుదర్శన్, శంకర్, మల్లేశం, శంకర్, రాజేశం, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిలో కరాటే పోటీలు

పెద్దపల్లి, మార్చి9: జిల్లా కేంద్రంలో ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీ యాదగిరి ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ స్థాయి కుంగ్‌ఫూ,కరాటే పోటీలు నిర్వహించారు. అనం తరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్ర మంలో ఏగోలపు సదయ్య గౌడ్, కరాటే మాస్టర్లు, పాల్గొన్నారు.

ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

నూతన కార్యవర్గం

కోరుట్ల, మార్చి 9: పట్టణంలోని మోటార్ సైకిల్ వర్క్ షాపు యజమానుల సొసైటీ నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా గోవర్ధన్, ఉపాధ్యక్షుడిగా వాజిద్, ప్రధాన కార్యదర్శిగా రమేశ్, సహాయ కార్యదర్శిగా వడ్లకొండ రమేశ్, కోశాధికారిగా అంజయ్య ఎన్నికయ్యారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఫర్టిలైజర్‌సిటీ, మార్చి 9: మహిళలు భవిష్యత్‌లో కూడ అన్ని రంగాల్లో రాణించాలని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకట సచిన్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కోర్టు ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో న్యాయమూర్తి మాట్లాడారు. అన్ని రంగాల్లో ముందంజలో ఉంటున్న మహిళలు విజయం దిశగా సాగాలన్నారు. మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి స్వారిక మాట్లాడుతూ మహిళలు ఏ విషయంలో నూ భయపడవద్దన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ కమిటీ న్యాయమూర్తి స్వారికతో పాటు 35మంది మహిళ న్యాయవాదులను సన్మానించారు. ఇక్కడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తౌటం సతీశ్, చిలకల పద్మజ, తదితరులు పాల్గొన్నారు.